క్లుప్తంగా

నేడు అన్నసమారాధన



మెళ్లూరులో సామ్రాజ్య సీతారామస్వామి

బిక్కవోలు: మండలంలోని మెళ్లూరులో అయోధ్య బాలరాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా సోమవారం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు సామ్రాజ్య సీతారామస్వామి ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం ఆలయం వద్ద జరిగే అన్న సమారాధనకు భక్తులంతా హాజరై స్వామి ప్రసాదాన్ని స్వీకరించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.


నేడు లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

మధురపూడి: కోరుకొండలో కొలువుదీరిన శ్రీలక్ష్మీనరసింహస్వామికి సోమవారం రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణతో కలిసి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటలకు స్వామివారిని దర్శించుకున్న అనంతరం పూజలు నిర్వహిస్తారు.

నేడు సత్తిరాజుకు సత్కారం

రంగంపేట: అయోధ్య రామాలయ నిర్మాణ కార్యక్రమానికి కర సేవకునిగా సేవలందించిన వడిశలేరుకు చెందిన వల్లూరి సత్తిరాజును సోమవారం అయోధ్య రామాలయ ప్రారంభోత్సవం సందర్భంగా సత్కరించనున్నట్లు స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత భజేనారాయణ స్వామి ఆలయ చైర్మన్ మావిరెడ్డి నెహ్రూ ఆదివారం తెలిపారు. స్థానిక భజన మండలి సభ్యులు, గ్రామస్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఆదిత్యునికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో ఉన్న సూర్యదేవుడు, దేవరులు

పెదపూడి: మండలంలోని జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత ఆదిత్యునికి ఆదివారం ఆలయంలో ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు పంచామృతాభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం ఏర్పాటుచేశారు.

ఘనంగా సత్తెమ్మ తల్లి జాతర



కొంకుదురు జాతరలో గరగ నృత్యాలు

బిక్కవోలు: మండలంలోని కొంకుదురులో చిన్నం వంశీయుల కులదేవత సత్తెమ్మ తల్లి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద గరగ నృత్యాలు, డోలుసన్నాయి మేళాలతో అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. చిన్నం వంశీయుల ఆడపడుచుల రాకతో గ్రామం కోలాహలంగా మారింది. ఏటా సంక్రాంతి పండగ వెళ్లిన తరువాత మొదటి ఆదివారం సంబరం చేయడం ఆనవాయితీగా వస్తుంది. సంబరం అనంతరం అన్న సమారాధన నిర్వహించారు.

ఆరోగ్యశ్రీ హెల్త్‌కార్డుల పంపిణీ



కాంద్రేగులలో లబ్ధిదారునికి ఆరోగ్యశ్రీ కార్డు అందజేస్తున్న ఎంపీడీఓ సాయిబాబు

పెదపూడి: మండలంలో నూతనంగా 23,465 ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరు కాగా ఇప్పటివరకూ 11,981 కార్డులు పంపిణీ చేశామని ఎంపీడీఓ వీవీ సాయిబాబు అన్నారు. ఆదివారం ఆయన శహపురం, పెదపూడి, పెద్దాడ తదితర గ్రామాల్లో ఆరోగ్యశ్రీ నూతన హెల్త్ కార్డుల పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కార్డు పేదలకు వరమన్నారు. ప్రజలందరూ ఆపద సమయంలో ఆరోగ్యశ్రీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, సచివాలయ కార్యదర్శి యాళ్ల ఉమామహేశ్వరరావు, లక్ష్మీనారాయణ, మన్యం శ్రీనివాసుచౌదరి, త్రినాథ్, స్వామి, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలుపు నివారణతో అధిక దిగుబడి

- దాదాపు పూర్తయిన రబీ వరి నాట్లు
- కలుపు తీతలో అన్నదాతలు బిజీ



పందలపాకలో కలుపు తీస్తున్న కూలీలు

బిక్కవోలు: రబీ వరి నాట్లు దాదాపు పూర్తయ్యాయి. బోర్లపై సాగు చేసిన చోట ఇప్పటికే వరి మూన తిరిగే దశకు చేరుకున్నాయి. ఈ ఏడాది నియోజకవర్గంలో 85 శాతం మేర వెదజల్లు విధానంలోనే సాగు చేపట్టినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. వెదజల్లు విధానంలో అధిక దిగుబడులకు అవకాశం ఉన్నా కలుపు ఎక్కువగా పెరుగుతుంది. దీంతో కలుపు నివారణపై దృష్టి సారించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. దీంతో రైతులంతా కలుపుతీత పనుల్లో బిజీబిజీగా గడుపుతున్నారు.

ఎరువులనూ వదలదు

అనపర్తి నియోజకవర్గంలోని బిక్కవోలు, అనపర్తి, రంగంపేట, పెదపూడి మండలాల్లో రబీలో మొత్తంగా 52 వేల ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. వరిలో ఊద, గరిక, తుంగ, అంతర తామర, నక్షత గడ్డి, సర్వసతి ఆకు తదితర రకాల కలుపు వ్యాపిస్తుంది. వరిలో కలుపు నివారణ చేపట్టకపోతే ఎకరం పంటకు గాను 12 శాతం నుంచి 50 శాతం వరకూ దిగుబడి తగ్గిపోయే ప్రమాదముంది. అందుకే కలుపుంటే చేలో వేసే ఎరువులు వరి మొక్కకు అందకుండా కలుపు తినేస్తుంది. కలుపు వల్ల పొలంలో తెగుళ్లు అధికంగా వ్యాపిస్తాయి. పంట నాణ్యత తగ్గిపోతుంది. కలుపు ఉన్న పొలంలో ఎరువులు వేస్తే ఎకరాకు 23 కిలోల నత్రజని, 14 కిలోల సూపర్ ఫాస్ఫేట్, 23 కిలోల పొటాష్ వృథా అవుతుందని అధికారుల అంచనా. కొన్ని రకాల కలుపు మొక్కల వల్ల విష పదార్థాలు సైతం భూమిలోకి చేరతాయి. కలుపు మొక్కలు ఉన్న పొలంలో పనిచేయడం వల్ల రైతులకు చర్మవ్యాధులు, కళ్ల మంటలు వంటి సమస్యలు వస్తాయి. కలుపు మొక్కలను పశువులకు గ్రాసంగా వేస్తే వాటికి కూడా ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి.

నివారణ చర్యలివి

డ్రమ్ సీడర్, మెషీన్లతో నాట్లు వేసిన పొలంలో విత్తనాలు వేసిన ఐదు రోజుల్లో కలుపు నివారణ నిమిత్తం ఎకరాకు ప్రిటిలాక్లోర్+సేఫనర్ 500 మి.లీ. మందును పిచికారీ చేయాలి. లేదా బ్యూటాక్లోర్+సేఫనర్ 1250 మి.లీ లేదా అరలీటరు నీటిలో అక్సాడయార్జిల్ 35 గ్రాముల పొడి మందును, 25 కిలోల పొడి ఇసుకలో కలిపి పొలంలో చల్లుకోవాలి. వెదజల్లు, డ్రమ్ సీడర్ పద్ధతిలో నేరుగా విత్తనాలు చల్లడం వల్ల విత్తనంతో పాటు పొలంలో కలుపు మొక్కలు ఎక్కువగా పెరుగుతాయి. కాబట్టి పైపద్ధతుల్లో నాట్లు వేసిన పొలంలో కలుపు నివారణ చర్యలు సకాలంలో చేపట్టాలి. విత్తనం నాటిన 20 నుంచి 25 రోజుల్లో ఊద ఎక్కువగా ఉంటే సైహలో పాప్ బ్యుటైల్ ఎకరాకు 400 మి.లీ. మందు పిచికారీ చేయాలి. గడ్డి జాతి మొక్కలు ఎక్కువగా ఉంటే బిస్ పైరి బ్యాక్ సోడియం 100 మి.లీ. లేదా వెడల్పాటి కలుపు మొక్కలు ఉంటే 2, 4-డీ సోడియం లవణం 500 గ్రాములు మందును లీటరు నీటికి 2.5 గ్రాములు చొప్పున కలిపి ఎకరాకు 200 లీటర్లు మందు పిచికారీ చేయాలి.

కలుపు తీశాకే ఎరువులు వేయాలి



పొలంలో కలుపు ఉండగా ఎట్టి పరిస్థితుల్లో ఎరువులు వేయకూడదు. కలుపు ఉన్నప్పుడు వేసిన ఎరువులు వరి మొక్కల కంటే కలుపు మొక్కలు ఎక్కువగా తీసుకోవడం వల్ల పంటకు నష్టం జరుగుతుంది. పైగా రైతులు పెట్టిన పెట్టుబడి వృథా అవుతుంది.

– శామ్యూల్‌జాన్, ఏఓ, బిక్కవోలు

జగన్‌తోనే అక్కచెల్లెమ్మలకు ఆర్థిక స్వావలంబన



కోరుకొండలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- కోరుకొండలో గడప గడపకూ మన ప్రభుత్వం

మధురపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న చేయూత, ఆసరా, సున్నా వడ్డీ తదితర పథకాలతో అక్కచెల్లెమ్మలకు ఆర్థిక స్వావలంబన వరిస్తోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు జక్కంపూడి రాజా అన్నారు. ఆదివారం కోరుకొండలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజానగరం నియోజకవర్గంలో రూ.3వేల కోట్లతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించినట్లు, కోరుకొండ గ్రామానికి 9.40 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు నిర్వహించామన్నారు. శ్రీలక్ష్మీ నరసింహ స్వామి రథం రోడ్డును రూ.1.25 కోట్లతో నిర్మించినట్టు తెలిపారు. అలాగే సొంతిల్లు లేని పేదలు 648 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించినట్టు తెలిపారు. అవినీతికి తావులేకుండా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో నేరుగా సంక్షేమ పథకాల నగదును జమ చేసిన ఏకైక ప్రభుత్వమిదే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు చెందిన పేద మహిళలకు ఆత్మగౌరవం కల్పించిందని, అది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊతమయ్యిందన్నారు. కోరుకొండలోని తలుపులమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే దర్శించుకున్న తర్వాత ఆయన గడప గడపకూ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం రాత్రి 9 గంటల వరకూ జరిగింది. స్థానిక మహిళలు ఆయన హారతులిస్తూ ఆప్యాయంగా స్వాగతం పలికితే, పురుషులు బాణసంచా కాల్పులతో ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు అడపా కనకరాజు, గణేశుల పోసయ్య, కోరుకొండ ఎంపీటీసీ కాళ్ల వీరబాబు, ఎంపీటీసీ కో-ఆప్షన్ సభ్యుడు గొల్లపల్లి ప్రవీణ్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాగదేవతకు ప్రత్యేక పూజలు



నాగుల పుట్ట వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు



అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

అనపర్తి: భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పూజలందుకుంటున్న మండలంలోని కొప్పవరం గ్రామదేవత సత్తెమ్మ తల్లికి మూడు రోజుల పాటు నిర్వహించే జాతరలో రెండో రోజు ఆదివారం అమ్మవారి ప్రతిరూపంగా కొలిచే నాగదేవతకు ప్రత్యేక పూజలు చేశారు. దీంట్లో భాగంగా మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ గ్రామస్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకోవడానికి వచ్చారు. విచిత్ర వేషధారణలు ధరించిన పలువురు భక్తులు ఊరేగింపుగా గ్రామ శివారులో జమ్మి చెట్టు వద్ద గల పుట్ట వద్దకు తరలి వెళ్ళి పుట్టలో పాలు పోసి నాగదేవతకు మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం జాతర సంప్రదాయంలో భాగంగా నాగుల పుట్ట నుంచి తిరిగి వస్తున్న పూజారులను అమ్మవారి ఆలయంలోనికి ప్రవేశించకుండా విచిత్ర వేషధారులు అడుగడుగునా అడ్డుకున్నారు. ఆలయ పూజారి పలుమార్లు ఆలయంలోకి వెళ్ళేందుకు ప్రయత్నించినా భక్తులు అడ్డు తొలగక పోవటంతో పాటు పూజారులు పేక బెత్తంతో వారందరినీ దండించారు. అయితే ఈ విధంగా పూజారితో బెత్తం దెబ్బలు తింటే అమ్మవారి అనుగ్రహం కలుగుతుందని భక్తుల విశ్వాసం. జాతరకు జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.

‘నన్నయ’లో క్రీడాపోటీలు



కబడ్డీ పోటీలు



క్యారమ్స్ ఆడుతున్న విద్యుత్ ఉద్యోగులు



చదరంగం ఎత్తులు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్రీడా మైదానంలో ఏపీఈపీడీసీఎల్ 9వ ఇంటర్ డివిజన్ క్రీడా పోటీలు రెండో రోజు ఆదివారం కొనసాగాయి. రాజమహేంద్రవరం, రంపచోడవరం డివిజన్ జట్ల మధ్య జరిగిన కబడ్డీ పోటీలో రాజమహేంద్రవరం జట్టు విజేతగా నిలిచిందని ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ టీవీఎస్‌మూర్తి తెలిపారు. వాలీబాల్ పోటీలో కాకినాడ, రాజమహేంద్రవరం టీమ్‌లు తలపడగా కాకినాడ టీమ్ విజేతగా నిలిచింది షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ విభాగంలో రాజమహేంద్రవరం టీమ్ విజయాన్ని దక్కించుకోగా, సింగిల్స్‌లో కాకినాడ డివిజన్ (ఆపరేషన్) సహాయ ఇంజినీర్ షేక్ షిలార్ గెలుపొందారు. కేరమ్స్ పోటీలో రంపచోడవరం పై రాజమహేంద్రవరం విజయం సాధించిందన్నారు. చదరంగం పోటీలు జరుగుతున్నాయి.

అయోధ్య అక్షతల పంపిణీ



మునికూడలిలో శోభాయాత్ర నిర్వహిస్తున్న రామభక్తులు

మధురపూడి: మండలంలోని బూరుగుపూడి తదితర గ్రామాల్లో అయోధ్య రాముడి అక్షతలను ఆదివారం పంపిణీ చేశారు. అయోధ్యలో బలరాముడి ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని గ్రామీణ ప్రాంతంలో అక్షతలను భక్తిశ్రద్ధలతో భక్తులకు అందించారు.

సీతానగరం: మునికూడలిలో అయోధ్య శ్రీరామచంద్రుని దివ్య అక్షతలు వితరణ చేశారు. రామ రామ భక్తులందరూ శోభాయాత్ర వెళ్లి అక్షతలను పంపిణీ చేశారు.ఈ యాత్రలో ముఖ్య అతిథిగా బీజేపీ రాజానగరం నియోజకవర్గం కన్వీనర్ నీరుకొండ వీరన్న చౌదరి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో రామభక్తులు పాల్గొన్నారు.

డ్వామా పీడీగా ముఖలింగం



ముఖలింగంను పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరిస్తున్న ఉద్యోగులు

రాజమహేంద్రవరం రూరల్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(డ్వామా) జిల్లా ఇన్‌చార్జి ప్రాజెక్టు డైరెక్టర్‌గా జిల్లా ముఖ్యప్రణాళికాధికారి (సీపీవో) ఎ.ముఖలింగంను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆయన ఆదివారం డ్వామా పీడీగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ డ్వామా పీడీగా పని చేసిన జగదాంబ పలు అవినీతి ఆరోపణల నేపథ్యంలో పూర్వపు విధులు నిర్వహించిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ కత్తిపూడి ఏపీడీగా వెళ్లారు. పీడీగా బాధ్యతలు స్వీకరించిన ముఖలింగంకు పరిపాలనాధికారి సూర్యనారాయణ, ఫైనాన్స్ మేనేజర్ కిషోర్, రాజమహేంద్రవరం, కొవ్వూరు క్లస్టర్ల ఏపీడీలు బి.రాంప్రసాద్, పీఎస్ అప్పలరాజు, డ్వామా సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరు మద్యం విక్రయిస్తున్న షేక్‌ఈసఫ్‌షాను ఆదివారం అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ నార్త్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ ఆదివారం తెలిపారు. అతని వద్ద నుంచి 180ఎంఎల్ 10 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రామయ్య రాక.. కోట్లాది జనులకు వెలుగు రేఖ




అయోధ్య రామ మందిరం చిత్రాన్ని గీస్తున్న సాత్విక్



పల్ల వెంకన్న నర్సరీలో ఏర్పాటు చేసిన మొక్కల కూర్పు





దీపోత్సవాన్ని రామయ్య రాకకు వెలుగురేఖగా గీసిన బాపిరాజు చిత్రం,(అంతర చిత్రంలో పుప్పాల బాపిరాజు)

సీటీఆర్ఐ: అయోధ్యలో 2017లో ప్రారంభమైన లక్షదీపోత్సవం ఎందరి హృదయాల్లోనో ఆధ్యాత్మిక భావనను వెలిగించింది. ఇక సోమవారం అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠతో భారతావనికి ఆధ్యాత్మిక వెలుగులు మరింత వన్నె తేనున్నాయని రాజమహేంద్రవరం నగరానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు, డ్రాయింగ్ ఉపాధ్యాయులు డాక్టర్ పుప్పాల బాపిరాజు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దీపోత్సవాన్ని రామయ్య రాకకు వెలుగురేఖగా చిత్రించారు.

విద్యార్థి చిత్ర నైపుణ్యం

కడియం: వేమగిరి గ్రామానికి చెందిన విద్యార్థి వాసంశెట్టి సాత్విక్ శ్రీరామ మందిరం ఆకృతిని చిత్రికరించాడు. వివిధ రంగులతో సుందరంగా తీర్చిదిద్దిన ఈ చిత్రాన్ని స్థానిక రామాలయంలో ఉంచేందుకు ఆలయ నిర్వాహకులకు ఇవ్వనున్నారు.

మొక్కలతో శ్రీరాముని చిత్రం

కడియం: స్థానిక పల్ల వెంకన్న నర్సరీలో విల్లు ఎక్కుపెట్టిన శ్రీరాముని చిత్రంతో మొక్కల కూర్పు ఏర్పాటు చేశారు. నర్సరీ రైతు పల్ల వెంకటేష్ తెలిపారు. పితృవాక్య పరిపాలకుడిగా శ్రీరాముడు సర్వ మానవాళికీ ఆరాధ్యుడన్నారు.

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరామర్శలు



సూర్యకుమారి తల్లిదండ్రుల చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: కోరుకొండ ఎంపీపీ ఉల్లి వీరవెంకట సత్య సూర్యకుమారి, ఆమె భర్త బుజ్జిబాబులను జంభూపట్నంలో ఆదివారం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా పరామర్శించారు. సూర్యకుమారి తల్లి తేలు సత్యవతి ఇటీవల మృతి చెందారు. తండ్రి తేలు సూర్యచంద్రరావు డిసెంబరు 20న మృతిచెందారు.ఈ సందర్భంగా వారిని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఇదే గ్రామానికి చెందిన చొంగా శేషమ్మ మృతి చెందారు. ఆ కుటుంబానికి సానుభూతిని తెలిపారు. కోరుకొండకు చెందిన పంపన విష్ణుతేజ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయాలపాలయ్యాడు. ఆయనను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట జంభూపట్నం సర్పంచ్ ఉల్లి అప్పన్నదొర, మాజీ సర్పంచ్ నాగా సత్తిబాబు, మాజీ ఎంపీటీసీ ఉల్లి చెల్లారావు, కోరుకొండ పీఏసీఎస్ మాజీ చైర్మన్ నాగా రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

లెనిన్ శత వర్ధంతి



శహపురంలో లెనిన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాజుబాబు తదితరులు

పెదపూడి: లెనిన్ శత వర్ధంతిని పురస్కరించుకుని మండలంలోని శహపురంలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం(ఏపీఆర్‌సీఎస్) నాయకులు ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏపీఆర్‌సీఎస్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజుబాబు మాట్లాడుతూ లెనిన్ ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకుని కమ్యూనిస్టు శ్రేణులు బలమైన ప్రజా ఉద్యమ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి మడికి సత్యం, జిల్లా ప్రతినిధులు ఎల్లే సత్తిబాబు, ధనాల ప్రసాద్, వల్లూరి సత్తిబాబు, వీర్రాజు, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



చినకొండేపూడిలో పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ చైత్రవర్షిణి

సీతానగరం: మండలంలోని సీతానగరం నుంచి పురుషోత్తపట్నం వరకూ పోలింగ్ బూత్‌లను రాజమహేంద్రవరం ఆర్డీఓ ఎ.చైత్ర వర్షిణి పరిశీలించారు. ఆదివారం తహసీల్దార్ పొగిరి కృష్ణారావుతో కలిసి ఆమె సీతానగరం, చినకొండేపూడి, చీపురపల్లి, సింగవరం, వంగలపూడి, రామచంద్రపురం, పురుషోత్తపట్నం తదితర గ్రామాల్లో 31 పోలింగ్ స్టేషన్‌లను పరిశీలించారు. పోలింగ్ స్టేషన్ల వద్ద మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ లక్ష్మి, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

అర్హులందరికీ నివాస స్థలాలు



స్థలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ నివాస స్థలాలు మంజూరు చేస్తామని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని ముక్కినాడ, ముక్కినాడపాకలులో సుమారు 200 మంది నివాస స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకోసం అనువైన స్థలాలను ముక్కినాడలో సంబంధిత అధికారులతో కలిసి ఆదివారం పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ మండెల సునీత, ఆనదాస సాయిరామ్, ఎ.సత్యనారాయణ,సోడసాని సత్తిబాబు పాల్గొన్నారు.

ఆరోగ్యకర భోజనం అందిస్తున్నాం

సీటీఆర్ఐ: జీవకారుణ్య సంఘంలోని వృద్ధులు, రోగులు, విద్యార్థులకు బలవర్ధకమైన, ఆరోగ్యకరమైన భోజనం, అల్పాహారం అందించడానికి చర్యలు తీసుకున్నామని శ్రీగౌతమీ జీవకారుణ్య సంఘం చైర్మన్ బర్రె కొండబాబు అన్నారు. ఆదివారం ఆయన సంఘం డైరెక్టర్లు, అధికారులు, వైద్యులతో కలిసి వృద్ధులను పరామర్శించారు. సదుపాయాలు ఎలా ఉన్నాయి. భోజనం, టిఫిన్ బాగుంటుందా, వేళకు అన్నీ అందుతున్నాయా అని ఆరా తీశారు. అక్కడ అంతా బాగుందని వారు చెప్పడంతో ఆయన ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం వంటశాలను సందర్శించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అనంతరం కొండబాబు మాట్లాడుతూ తమ పాలక మండలి బాధ్యతలు చేపట్టిన తర్వాత జీవకారుణ్య సంఘంలోని వృద్ధులకు, రోగులు, అనాథ విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా భోజనం, అల్పాహారంలో పూర్తిగా మార్పులు తీసుకు వచ్చామని, నాణ్యమైన సన్న బియ్యంతో ఆహారం అందిస్తున్నామని తెలిపారు. మంచి బియ్యంతో భోజన ఏర్పాట్లు చేయాలని దాతలకూ సూచిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డైరెక్టర్లు నాగులపల్లి బి.వి.లక్ష్మణరావు, పిల్లి నాగేంద్రప్రసాద్, డాక్టర్ ఎస్. అశోక్, దత్తాత్రేయ, విజయకుమార్, రామ్మోహనరావు పాల్గొన్నారు.